నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 10 ఆగస్టు 2024 | RANGAREDDY

# కుక్కలా.. క్రూర మృగాలా !



ఒంటరిగా మనిషి కనిపిస్తే చాలు.. పైశాచికంగా దాడి..

చిన్నారుల ప్రాణాలు తీస్తున్న వైనం

తాజాగా ఓ బాలుడి మర్మాంగాలను కొరికేసిన వీధి కుక్కలు

ప్రాణాపాయస్థితిలో బాలుడు

నెలరోజుల కిందట కుక్కల దాడిలో గాయపడిన మరో బాలుడు

చికిత్సపొందుతూ మృతి

బతుకుదెరువు కోసం మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వలస వచ్చి కోకాపేటలోని సబితానగర్‌లో ఉంటున్న రాజు, అంజమ్మ దంపతులకు ఇద్దరు పిల్లలు. కూలీనాలీ చేసుకుంటూ..కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. పెద్ద కుమారుడు భరత్(7) పుట్టుక నుంచే మానసిక అంగవైకల్యంతో బాధపడుతూ..మంచానికే పరిమితమయ్యాడు. కాగా, శుక్రవారం ఉదయం ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న భరత్‌పై వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఇంటి పక్కన వంట చేసుకుంటున్న తల్లి అంజమ్మ పిల్లాడి అరుపులు విని వచ్చేసరికి మూడు కుక్కలు బాలుడి మర్మాంగాలను కొరికేశాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో బాలుడిని నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలుడి పరిస్థితిని గమనించిన వైద్యులు..వెంటనే ఆపరేషన్ చేశారు. రెండ్రోజులు గడిస్తే కానీ చెప్పలేమంటున్నారు. ఇదిలా ఉండగా, రొక్కాడితే డొక్కాడని.. జీవితాలు మావని.. వీధి కుక్కల దాడితో మరింత దయనీయ స్థితికి చేరుకున్నామని బాలుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఆపరేషన్ కోసం వైద్యులు రూ. 30వేలు అడుగుతున్నారని, తమ వద్ద అంత డబ్బులు లేవని, సాయం చేయాలంటూ.. ఆస్పత్రికి వచ్చిపోయే వారిని వేడుకోవడం చూపరులకు కంటతడి పెట్టించింది. అయితే ఆస్పత్రి వైద్యులు సైతం పెద్ద మనస్సు చాటుకున్నారు. ముందస్తుగా ఆపరేషన్ పూర్తిచేసి.. బాలుడి ప్రాణానికి ప్రమాదం జరుగకుండా చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉంటే వారం రోజుల కిందట సబితానగర్‌లోనే తన కుమారుడిపై అవే కుక్కలు దాడికి పాల్పడడంతో చికిత్స చేయిస్తున్నట్లు భరత్ పెద్దనాన్న నాగేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల వీరంగంపై స్థానిక నార్సింగి మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని వాపోయారు.

**వీధి కుక్కలు క్రూర మృగాలుగా మారుతున్నాయి. ఒంటరిగా మనిషి కనిపిస్తే చాలు..వెంబడించి దాడికి తెగబడుతున్నాయి. ముఖ్యంగా అభంశుభం తెలియని చిన్నారులపై విరుచుకుపడుతున్నాయి. వారి ప్రాణాలను తీస్తున్నాయి. వరుసగా జరుగుతున్న కుక్కల స్వైరవిహారంతో నగరవాసులు ఇప్పటికే బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా ఓ ఇంట్లోకి చొరబడి మానసిక ఆరోగ్య స్థితి బాగోలేని బాలుడిపై కుక్కలు పైశాచికంగా దాడి చేసి..అతడి మర్మాంగాలను కొరికేశాయి. కలవరానికి గురిచేసిన ఈ ఘటన కోకాపేట సబితానగర్‌లో చోటు చేసుకున్నది.**

**-మణికొండ/ఇబ్రహీంపట్నంరూరల్ /తెలుగు యూనివర్సిటీ ఆగస్టు 9**

## కుక్కల దాడిలో బాలుడి మృతి

ఇబ్రహీంపట్నంరూరల్/తెలుగు యూనివర్సిటీ ఆగస్టు 9 : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయపోల్ గ్రామంలో కుక్కల దాడిలో గాయపడిన ఉడుతల శివకుమార్ మాధురి దంపతుల కుమారుడు కియాన్ష్‌గౌడ్ (4) శుక్రవారం చికిత్స పొందుతూ చనిపోయాడు. నెలరోజుల కిందట కుక్కల దాడిలో బాలుడికి కుడివైపు చెంపపై బలంగా గాయమైంది. వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో బాబును గురువారం రాత్రి నిలోఫర్‌కు తీసుకొచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కియాన్ష్ చనిపోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.



వీధికుక్కల దాడిలో మృతి చెందిన కియాన్ష్‌గౌడ్(ఫైల్)



శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో పేరుకుపోయిన చెత్తకుప్ప



శంకర్‌పల్లిలో అస్తవ్యస్తంగా మారిన వీధి

### పడకేసిన 'ప్రత్యేక' పాలన

# ఎట్లుండె పల్లె..ఎట్లాయె!

**రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నది. రాజకీయ హడావుడి తప్పితే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులతోపాటు సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు శూన్యం. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు, కేంద్రం నుంచి వచ్చే నిధులు నెలనెలా అందడం లేదు. ఫలితంగా నిధుల లేమితో పంచాయతీల్లో పాలన పడకేసింది. ప్రత్యేక అధికారులు చుట్టపు చూపుగా వస్తుండగా.. పంచాయతీ కార్యదర్శుల పైనే పనిభారం పడుతున్నది. పంచాయతీ సిబ్బందికి కనీసం జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొన్నది. ట్రాక్టర్లకు కిస్తీలు కట్టలేని పరిస్థితి నెలకొనడంతో పారిశుద్ధ్య, తాగునీటి నిర్వహణ కూడా అస్తవ్యస్థంగా మారి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలోని 558 గ్రామపంచాయతీల్లోనూ పాలన తిరుగోమన దిశగా సాగుతున్నది. రోజురోజుకూ పెరిగిపోతున్న సమస్యలతో పదేండ్లుగా మాయమైపోయిన కష్టాలు నేటి కాంగ్రెస్ పాలనలో మళ్లీ ప్రత్యక్షమై పల్లె ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి.**

**- రంగారెడ్డి, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ)**

నిధుల కొరతతో గ్రామ పంచాయతీలు విలవిల

పంచాయతీ కార్యదర్శులపైనే పనిభారం

పారిశుద్ధ్య, తాగునీటి నిర్వహణ అస్తవ్యస్థం

పదేండ్ల కిందటి పరిస్థితులు మళ్లీ ప్రత్యక్షం!

పెదవి విరుస్తున్న రంగారెడ్డి జిల్లా ప్రజానీకం

### పంచాయతీల్లో ఆర్థిక సంక్షోభం..

పంచాయతీలకు ఆస్తి పన్ను, ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థికసంఘం ద్వారా నిధులు సమకూరుతున్నాయి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు అవసరం మేర విడుదల కావడం లేదు. గతంలో ప్రతినెలా నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యేవి. కానీ.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, పైపుల లీకేజీ మరమ్మతులు, ట్రాక్టర్ కిస్తీలు, వీధి దీపాల నిర్వహణ, విద్యుత్తు బకాయిలు వంటి వాటికి ప్రతి నెలా నిధులను ఖర్చు చేయాల్సిందే. ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులే ఎలాగోలా సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. అత్యవసర పనులను చేపట్టే సందర్భాల్లో అప్పుచేసి మరీ చెల్లింపులు జరుపుతున్నారు. కొత్తగా అభివృద్ధి పనులను సైతం చేపట్టే పరిస్థితి లేకుండా పోతున్నది. గత ఏడు నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులు పెండింగ్‌లో ఉండగా.. పదిహేను రోజుల క్రితం రూ.7.56 కోట్ల ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల అయ్యాయి. రెండు రోజుల క్రితమే రూ.7.83 కోట్ల మేర ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. అయితే వచ్చిన ఈ కొద్దిపాటి నిధులు ఏ మూలకు సరిపోవన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వచ్చిన ఈ కొద్దిపాటి నిధులు పాత బకాయిలకే సరిపోతాయని, మళ్లీ అప్పు చేయక తప్పదని పలువురు అధికారులే బాహాటంగా పేర్కొంటున్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. మండల, డివిజన్ స్థాయిలోని గెజిటెడ్ ఉద్యోగులకు మూడు కంటే ఎక్కువ పంచాయతీలను అప్పగించారు. ఈ లెక్కన జిల్లాలోని 558 గ్రామపంచాయతీల పగ్గాలను ప్రభుత్వం 252 మంది ప్రత్యేకాధికారులకు అప్పగించింది. అయితే ఆయా అధికారులు తమ శాఖలకు సంబంధించిన పనిభారంతోనే సతమతమవుతుండడంతో అదనంగా పంచాయతీల బాధ్యతలను చూడడంలో ఉదాసీనతను ప్రదర్శిస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మిషన్ భగీరథ నీటి సరఫరాలోనూ అవాంతరాలు ఏర్పడుతున్నాయి. పారిశుద్ధ్యం సైతం అస్తవ్యస్థంగా మారింది. నర్సరీల నిర్వహణ, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ సైతం ఉండడం లేదు. పంచాయతీల ఖర్చుల విషయంలో ప్రత్యేకాధికారులు చేతులెత్తేస్తుండడంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతున్నది. ఇదేక్రమంలో ప్రజా సమస్యలు సైతం సత్వరం పరిష్కారం కావడం లేదు.

#### ముసురుతున్న వ్యాధులు..

పంచాయతీల పాలన మొక్కుబడిగా సాగుతుండడంతో పల్లెలను వ్యాధులు చుట్టుముడుతున్నాయి. పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రస్తుత వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. విష జ్వరాలతోపాటు డెంగీ కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 8,960 వరకు వివిధ రకాల జ్వరాలు నమోదు కాగా.. 119కి పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టినప్పటికీ.. అదీ మొక్కుబడిగానే సాగింది. రాబోయే రోజుల్లోనూ పారిశుద్ధ్య పరిస్థితి ఇలాగే ఉంటే.. పరిస్థితి చేయిదాటి పోయే ప్రమాదం ఉందని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శంకర్‌పల్లిలోని ఓ వార్డులో ఇలా..

# డ్రాప్ చేస్తామని ట్రాప్ చేస్తూ..



తల్లీకూతురుతో బాధితురాలు మీనపల్లికి చెందిన మహేశ్వరి


**వికారాబాద్ జిల్లాలో రెచ్చిపోతున్న దొంగల ముఠా**

- **ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళలే లక్ష్యంగా చోరీలు**
- **డ్రాప్ చేస్తామంటూ కారులో ఎక్కించుకొని బంగారు నగలు, నగదు తస్కరణ**
- **రెండు రోజుల క్రితం గేట్‌వనంపల్లి వద్ద ఇదే తరహా ఘటన**
- **మూడున్నర తులాల నగలు, నగదును కొట్టేసిన దుండగులు**
- **ముంబై ముఠాగా గుర్తింపు.. రంగంలోకి ప్రత్యేక పోలీస్ బృందాలు**

వికారాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో కొత్త తరహా దొంగతనాలు షురూ అయ్యాయి. ఒంటరి మహిళలే టార్గెట్‌గా దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. రహదారుల్లో నడుచుకుంటూ వెళ్తున్న ఒంటరి మహిళలు కనపడితే చాలు.. లిఫ్ట్ ఇస్తామంటూ నమ్మించి కారులో ఎక్కించుకొని మత్తు మందు ఇచ్చి బంగారు నగలు, నగదు తస్కరిస్తున్నారు. అనంతరం వారిని నిర్మానుష్య ప్రాంతాల్లో కారులో నుంచి నెట్టేసి పరారవుతున్నారు. రెండు రోజుల క్రితం నవాబుపేట మండలం మీనపల్లికి చెందిన మహేశ్వరి, ఆమె తల్లి కాంతమ్మ, మూడేండ్ల కూతురుతో కలిసి ఆటో కోసం గేట్‌వనంపల్లి గేట్ దగ్గర ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో వికారాబాద్‌వైపు నుంచి ముగ్గురు పిల్లలతో పాటు రెండు జంటలు ప్రయాణిస్తున్న ఎర్టీగా వాహనం వచ్చి అక్కడ ఆపింది. కారులో నుంచి ఓ మహిళ దిగి మహేశ్వరి దగ్గరకు వచ్చి ఎక్కడికి వెళ్తున్నారంటూ ప్రశ్నించగా మీనపల్లి కలాన్ వెళ్తున్నామని బదులిచ్చారు. దీంతో సదరు మహిళ తాము కూడా మీనపల్లికలాన్ వెళ్తున్నామని, డ్రాప్ చేస్తాం రావాలంటూ కోరారు. కారులో పిల్లలు, ఆడవారు ఉండడంతో కుటుంబ సభ్యులు అనుకొని నమ్మిన మహేశ్వరి.. ఆమె తల్లి, మూడేండ్ల కూతురుతో కలిసి కారెక్కి కూర్చున్నారు. వెంటనే ఓ మహిళ మహేశ్వరిని అదిమి పట్టుకోగా మరో మహిళ ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కున్నారు. తల్లి, కూతురు అరుపులు, కేకలు వేయగా చంపుతామంటూ బెదిరించారు. ఆ తర్వాత కారులో నుంచి వారిని కిందకు నెట్టేసి పారిపోయారు. కొద్దిసేపటికి తేరుకున్న బాధితులు ఓ ఆటో వ్యక్తి సహాయంతో నవాబుపేట పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వికారాబాద్ నుంచి మోమిన్‌పేట వరకు సీసీ ఫుటేజీని పరిశీలించి దొంగలను ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. అనంతరం మహేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు మిమ్మల్ని డ్రాప్ చేస్తామంటూ ట్రాప్ చేసే ప్రయత్నం చేస్తే నమ్మకూడదని పోలీసులు సూచిస్తున్నారు.

#### ముంబై ముఠాగా గుర్తింపు..

గేట్‌వనంపల్లి గేట్ వద్ద మహిళల నుంచి మూడున్నర తులాల పుస్తెల తాడును దోచుకున్న ముఠా ముంబైకి చెందినదిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. సదరు దోపిడీ ముఠా హైవేలకు అనుబంధంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ ఒంటరి మహిళలను టార్గెట్‌గా చేసుకొని దోపిడీలకు పాల్పడుతుంటారని గుర్తించారు. ఎవరికీ అనుమానం రాకుండా కుటుంబ సభ్యులుగా కారులో పిల్లలతో సహా తిరుగుతూ దోచుకుంటుంటారని అనుమానిస్తున్నారు. ముఠాకు సంబంధించి జిల్లా పరిధి వరకు సీసీ పుటేజీలను గుర్తించిన జిల్లా పోలీసులు.. జహీరాబాద్ టోల్‌గేట్ వద్ద, తాండూరు వైపు చించోలి టోల్‌గేట్ వద్ద సీసీ పుటేజీని పరిశీలించినప్పటికీ ముఠా కనపడలేదు. వారిని పట్టుకునేందుకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఓ బృందం ముంబైకి సైతం వెళ్లినట్లు తెలిసింది.



చోరీకి పాల్పడిన దుండగుల కారు

#### దర్యాప్తు చేస్తున్నాం..

గేట్‌వనంపల్లి వద్ద మహిళల నుంచి మూడున్నర తులాల పుస్తెల తాడును దోచుకున్న ఘటనకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నాం. ముంబైకి చెందిన ముఠాగా ప్రాథమికంగా గుర్తించాం. అయితే ముందు, వెనుక భాగంలో కారు నంబర్ కనపడకుండా వెళ్తున్న దుండగుల కారుకు సంబంధించి జిల్లా పరిధిలో సీసీ పుటేజీలో గుర్తించాం. కానీ జహీరాబాద్ టోల్‌గేట్, చించోలి టోల్ గేట్ వద్ద సీసీ పుటేజీలో ముఠా వెళ్తున్న కారు ఆచూకీ లభించలేదు. సదరు ముఠాను పట్టుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– ఆంజనేయులు, మోమిన్‌పేట సీఐ





చైతన్యనగర్‌లో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

**అణగారిన ప్రజల ఎదుగుదలకు అంబేద్కర్ కృషి వెలకట్టలేనిది**

**'పీఎం జన్‌మన్'తో చెంచులకు మౌలిక సదుపాయాల కల్పన**

**పోడు భూముల సమస్యల పరిష్కారానికి కృషి**

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**

**చైతన్యనగర్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం**

పెద్దేముల్, ఆగస్టు 9 : ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలంలోని చైతన్యనగర్ నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, కొమురంభీం, చెంచు లక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఆదివాసీల పచ్చజెండాను ఆవిష్కరించారు. అనంతరం బహుళ ప్రయోజన కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ప్రసంగించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యను అభ్యసించాలన్నారు. రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో అణగారిన ప్రజల ఎదుగుదలకు అంబేద్కర్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికీ విద్యుత్తు, తాగునీరు, మరుగుదొడ్ల వంటి వసతుల కల్పనకు ఇంటింటి సర్వే నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి నాగరాణిని ఆదేశించారు. చైతన్యనగర్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పోడు భూముల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అంతకుముందు చైతన్యనగర్‌లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో అధికారులు,నాయకులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు.

#### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన పాటలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు, సంఘాల నాయకులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి, డీఎంహెచ్‌వో పాల్వాన్ కుమార్, తాండూరు మైన్స్ ఏడీ, మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, తహసీల్దార్ కె.కిషన్, ఎంపీడీవో జర్నప్ప, డీఎల్పీవో శంకర్ నాయక్, ఎంపీవో రతన్ సింగ్, ఏవో నసీరుద్దీన్, విద్యుత్తు డీఈ భానుప్రసాద్, ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకులు అంజయ్య, హన్మంతు, ఐటీడీఏ సిబ్బంది వినోద్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు